TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 118 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శుక్రవారం 04 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## అర్హులైన వారికి
# సంక్షేమ పథకాలు
## అందించేందుకే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే


- పైలట్ ప్రాజెక్టు కింద ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన గ్రామం, పట్టణంలో ప్రారంభమైంది.
- ఒకే కార్డు పేరిట పైలెట్ ప్రాజెక్ట్ ,ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

**శాసనసభ / హైదరాబాద్ :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్ హాకీ గ్రౌండ్స్ వేదికగా కుటుంబ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సీఎం ప్రయోగాత్మక పథకం కింద డిజిటల్ కార్డుల సమాచారం సేకరణ చేపట్టామని తెలిపారు.ఒకే కార్డు పేరిట పైలెట్ ప్రాజెక్ట్ : పేద కుటుంబాలకు డిజిటల్ కార్డులు రక్షణ కవచమన్న సీఎం దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు. సికింద్రాబాద్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఒకే రాష్ట్రం ఒకే కార్డు పేరిట పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వంలోని వివిధ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి ఒకే ఫ్యామిలీ డిజిటల్ కార్డులో పొందుపరుస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.రేషన్ కార్డు కోసం పదేళ్ల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగారన్న సీఎం మెరుగైన విధానంతో పరిపాలన సాగించేలా ఒకే రాష్ట్రం ఒకే కార్డు పేరిట పైలెట్ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే ఈ విధానం రుపొదించామన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో పథకాల సమాచారంతో పాటు ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరుస్తామని సీఎం తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే సమస్యల ఆధారంగా ముందు కెళతామని ముఖ్యమంత్రి వివరించారు.ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే : పైలట్ ప్రాజెక్టు కింద ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన గ్రామం, పట్టణంలో ప్రారంభమైంది. కరీంనగర్ జిల్లా తాహెర్ కొండాపూర్‌లో ఫ్యామిలి డిజిటల్ కార్డు సర్వేను మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ సర్వేలో ఏమైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ కోరారు.



మిగతా »»2లో

# సుప్రీంకోర్టు
## తలుపు తట్టిన శరద్ పవార్
### ఓటర్ల మధ్య గందరగోళం



**ఢిల్లీ / శాసనసభ :** మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అజిత్ పవార్ పార్టీకి కేటాయించిన గడియారం గుర్తును నివారించి ఆ పార్టీకి వేరే గుర్తును కేటాయించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.ఓటర్లలో గందరగోళాన్ని నివారించేందుకు అజిత్ పవార్ పార్టీకి గడియారం గుర్తుకు బదులుగా వేరే గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని తన పిటిషన్ లో పేర్కొన్నారు. గడియారం గుర్తుతో తమ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి 25 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు.

## సమంత విషయంలో నా మాటలు తప్పే కానీ...
## కొండా సురేఖ మరోసారి
# ఆసక్తికర వ్యాఖ్యలు

- విడాకులకు కారణాలేమిటో ఎవరూ బయటకు చెప్పలేదన్న మంత్రి
- నాగార్జున కుటుంబం లేదా సమంత కారణాలు వెల్లడించలేదన్న మంత్రి
- పరిశ్రమ నుంచి వచ్చిన అంతర్గత సమాచారాన్నే చెప్పానన్న సురేఖ



# రైల్వే ఉద్యోగులకు బోనస్..
## 5భాషలకు ప్రాచీన హెూదా..
## కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలివే..



**ఢిల్లీ / శాసనసభ :** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రైల్వే ఉద్యోగులకు బోనస్ ప్రకటించడంతో పాటు 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబిల్ ఆయిల్- ఆయిల్ సీడ్స్'కు ఆమోదం తెలిపింది.దేశంలో మరో ఐదు భాషలకు ప్రాచీన హెూదా కల్పించేందుకు ఆమోద ముద్ర వేసింది. దీంతో మరాఠీ, పాళి, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ భాషలకు ప్రాచీన హెూదా దక్కనుంది. ఇప్పటికే తెలుగు సహా ఆరు భాషలకు ప్రాచీన హెూదా ఉన్న విషయం తెలిసిందే. రాబోయే ఆరేళ్లలో నూనెగింజల ఉత్పత్తికి రూ.10,103 కోట్లు ఖర్చు చేయనుంది. వంట నూనె దిగుమతులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.రైల్వే ఉద్యోగులకు బోనస్ పండగల నేపథ్యంలో రైల్వే ఉద్యోగులకు బోనస్ చెల్లించేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

## కేటీఆర్, హరీశ్‌రావులపై సైబరాబాద్‌లో
# కేసు నమోదు



**శాసనసభ / హైదరాబాద్ :** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.సామాజిక మాధ్యమాల్లో కొండా సురేఖతో ఉన్న ఫొటోలపై ట్రోలింగ్ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలు యూట్యూబ్ ఛానల్స్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ప్రజల జీవన ప్రమాణాలు
## పెంచే కార్యక్రమాలపై ఆయా శాఖలు దృష్టి పెట్టాలి..



**అమరావతి / శాసనసభ :** ప్రభుత్వంలో వివిధ శాఖల్లో నూతన పాలసీలతో అన్ని రంగాలను గాడిన పెట్టి మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు అన్నారు. 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో ప్రభుత్వం పని చేయాలని అధికారులకు సూచించారు.వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవల రంగంలో వృద్ధి పై సచివాయలంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్ లో ఆయా శాఖల అధికారులు గత 10 ఏళ్ల కాలంలో పరిస్థితులను వివరించారు. గత పభుత్వం విధ్వంసకర విధానాలతో అన్ని రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయని.. దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందని సీఎం అన్నారు.కాగా, నేడు ప్రతిశాఖలో కొత్త పాలసీలు తీసుకువస్తున్నామని.. వీటిని సమర్థవంతంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు.. ప్రజలపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో సమగ్ర యాంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చన్నారు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడం మాత్రమే కాదని.. ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడం ముఖ్యమని చెప్పుకొచ్చారు. 2014 తరువాత విభజన కష్టాలు ఉన్నా..

### విజయవంతంగా ముగిసిన
## భట్టి విక్రమార్క విదేశీ టూర్



**శాసనసభ / హైదరాబాద్ :** విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని డిప్యూటీ సీఎం భట్టి శుక్రవారంనాడు హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పర్యటన ఫలప్రదమైంది. పెద్ద ఎత్తున పరిశ్రమాలతో ఒప్పందాలు, స్థాపనకు ఈంగీకారాలతో ఆయన స్వదేశానికి రానున్నారు.

మిగతా »»2లో

# భారీ వర్షాలు
## మరో మూడు రోజులపాటు



**శాసనసభ / హైదరాబాద్ :** రాష్ట్రంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలుపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది.



# రాష్ట్ర ఆదాయం పడిపోతోంది...
## పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం

శాసనసభ

శుక్రవారం 04 అక్టోబర్ - 2024

# 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లు పతకాలు సాధించాలి



**శాసనసభ / హైదరాబాద్:** 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లు పతకాలు సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ అథ్లెట్లకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే అని వెల్లడించారు.ప్రత్యేక రాష్ట్రం వచ్చాక క్రీడలను నిర్లక్ష్యం చేశారని, పదేళ్లలో యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు అయ్యారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించినవారికి ఉన్నత ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. నిబంధనలు సవరించి బాక్సర్ నిఖత్ జరీన్‌కు పోలీసు శాఖలో ఉద్యోగం ఇచ్చామని గుర్తుచేశారు. ఇంటర్మీడియట్ చదివిన క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ అథ్లెట్లకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని వెల్లడించారు. హైదరాబాద్ క్రీడలకు వేదికగా కావాలని, 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.అండర్-17 ఫుట్‌బాల్ జట్టును దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 25 ఏళ్ల క్రితం క్రీడల నిర్వహణలో దేశానికే తలమానికంగా నిలిచామని అన్నారు. చదువే కాదని, క్రీడల్లో రాణించినా మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఇవాళ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడలు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి సీఎం కప్ క్రీడల లోగో, మస్కట్‌ను విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి పోటీలు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఇటీవల పలు క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రెండు లక్షల నగదు బహుమతిని అందజేశారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇవ్వగా ఆమెకు లాఠీని అందించి శుభాకాంక్షలు తెలిపారు.'గత పదేళ్లలో క్రీడలను నిర్లక్ష్యం చేశారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారని పేపర్లల్లో, టీవీల్లో చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నాం. హైదరాబాద్ క్రీడలకు వేదికగా కావాలని ఈరోజు సీఎం కప్ వేడుకలను ప్రారంభించాం. సిరాజ్ ఇంటర్మీడియట్ వరకే చదివినా క్రీడల్లో రాణించినందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు సవరించి డీఎస్పీ ఉద్యోగం ఇచ్చింది'-రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి యువత వ్యసనాల జోలికి వెళ్లవద్దు త్వరలో ఎల్బీ స్టేడియంను అద్భుతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. 2018లో కొడంగల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి తాను ఓడిపోయానని, 2019లో ఎంపీగా గెలిచానని, ప్రస్తుతం సీఎంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. యువత వ్యసనాల జోలికి వెళ్లవద్దని, వ్యసనాల వల్ల ఏం సాధించలేరని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో క్రీడల సలహాదారులు జితేందర్ రెడ్డి, టీపీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్, తెలంగాణా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్ శివసేన రెడ్డి, డీజీపీ జితేందర్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.'ఈరోజు నిఖత్ జరీన్, సిరాజ్, పీవీ సింధు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్ఠలు సంపాదించిన క్రీడాకారులు. మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠతను పెంపొందించేది కూడా క్రీడాకారులే. క్రీడల్లో రాణించినవారికి మంచి భవిష్యత్ ఉంటుంది'-రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి

( మొదటి పేజీ తరువాయి )

## సుప్రీంకోర్టు తలుపు తట్టిన శరద్ పవార్

### ఓటర్ల మధ్య గందరగోళం

ఎన్ సీపీ రెండు వర్గాలుగా చీలిపోయిన తర్వాత శరద్ పవార్ వర్గానికి భారత ఎన్నికల సంఘం బాకా ఊదుతున్న వ్యక్తి గుర్తును ఎన్నికల గుర్తుగా కేటాయించింది. అయితే తమకు గడియారం గుర్తుతో అనుబంధం ఉందని, అజిత్ పవార్ వర్గం గడియారాన్ని ఉపయోగించుకుంటే ఓటర్లను తప్పుదారి పట్టించినట్లవుతుందన్నారు. దీనివల్ల ఎన్నికలు కూడా నిస్పక్షపాతంగా జరగవన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవలే జరిగిన లోక్ సభ ఎన్నికల సమయంలో ఓటర్ల మధ్య చోటుచేసుకున్న గందరగోళాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు.

### అక్టోబరు 15న విచారణ

త్వరలో జరిగేది అసెంబ్లీ ఎన్నికలు కావడంతో ఈ గుర్తుపై మరింత గందరగోళ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్నారు. శరద్ పవార్ దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు ఈనెల 15వ తేదీన విచారణ జరపబోతోంది. గడియారం గుర్తు ఎవరికి కేటాయిస్తుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. మహారాష్ట్రలో కొన్నాళ్ల క్రితం శివసేన పార్టీని చీల్చి ఏక్ నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. తర్వాత శరద్ పవార్ ఎన్ సీపీలో చీలిక తీసుకువచ్చి అతని మేనల్లుడైన అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గానికి అధికారంలో స్థానం కల్పించింది. ప్రస్తుతం అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

## రాష్ట్ర ఆదాయం పడిపోతోంది... పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం: కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం క్రమంగా పడిపోతోందని, పరిపాలనా వైఫల్యానికి ఇది నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 'తగ్గుతున్న సర్కార్ ఆమ్దానీ' పేరుతో 'వెలుగు' పత్రికలో వచ్చిన కథనాన్ని కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు. ప్రభుత్వ ఆదాయం పడిపోతోందని, అనుభవరాహిత్యంతోనే ఈ అనర్థమని పేర్కొన్నారు. సంపదను సృష్టించి పేదలకు పంచే తెలివి ఈ ముఖ్యమంత్రికి లేకపోవడమే సమస్య అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే ఈ దుస్థితి ఏర్పడితే రానున్న నాలుగేళ్లు మరింత కష్టమే అని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప దిద్దుబాటు చర్యలు కనుచూపు మేర కూడా కనిపించడం లేదని ఆరోపించారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం... మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్‌దే అంటూ తన ట్వీట్ ముగించారు.

## సమంత విషయంలో నా మాటలు తప్పే కానీ...: కొండా సురేఖ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు

నాగచైతన్య, సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాళ్ల విడాకుల అంశంపై తాను చేసిన వ్యాఖ్యలు తప్పే కావొచ్చని అన్నారు. కానీ నాగచైతన్య, సమత ఎందుకు విడిపోయారో ఇప్పటి వరకు ఎవరికీ తెలియదని, విడాకులకు కారణంపై ఇటు నాగార్జున కుటుంబం లేదా అటు సమంత నుంచి ఎవరూ చెప్పలేదన్నారు. పరిశ్రమ నుంచి వచ్చిన అంతర్గత సమాచారాన్ని మాత్రమే తాను చెప్పానని, ఆ మాటలు తాను కోపంలో అన్నానని వెల్లడించారు.తాను ఎప్పుడూ నిజాలే మాట్లాడుతానని, లోపల ఒకటి పెట్టుకొని బయట మరొకటి మాట్లాడే రకం కాదన్నారు. కేటీఆర్‌ను మాత్రం వదిలే ప్రసక్తి లేదన్నారు. మళ్లీ ఇదే రిపీట్ అయితే కేటీఆర్‌ను హైదరాబాద్‌లోనే కాదు... జిల్లాల్లోనూ తిరగనివ్వబోమని హెచ్చరించారు.

# కంటోన్మెంట్ సీఎం సభలో నీళ్లు లేక మహిళలు ఆందోళన....

### మహిళలకుసదుపాయాలని కల్పించని కంటోన్మెంట్ ఎమ్మెల్యే...?




**శాసనసభ / హైదరాబాద్:** ఒకే రాష్ట్రం ఒకే కార్డ్ కుటుంబ మరియు కుటుంబ డిజిటల్ కార్డ్ పైలెట్ ప్రాజెక్టు ను కంటోన్మెంట్ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సందర్భంగా..సీఎం రేవంత్ రెడ్డి సభ లో ప్రసంగిస్తుండగా మహిళలు ఒక్కసారిగా మేం ఉదయం 8 గంటల కు సమావేశానికి వచ్చినామని,తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని ఒక్కసారిగా మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా అక్కడే ఉన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అనుచరులు, ఉన్నతాధికారులు,పోలీసులు వారిని శాంతింపచేశారు



# గెలిపించి అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టిన సీఎంరేవంత్ రెడ్డి

## మల్కాజ్గిరిఎంపి ఈటెల రాజేందర్

**శాసనసభ / హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి కంటోన్మెంట్ లో ఒకే రాష్ట్రం ఒకే కార్డ్ కుటుంబ మరియు కుటుంబ డిజిటల్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ గా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ గాయత్రి గార్డెన్ లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ. ఫోటో కాల్ విషయంలో పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి,లోక్ సభ స్పీకర్ కు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు.రేవంత్ రెడ్డి తనపై వ్యక్తిగతంగా మాట్లాడడం సరికాదు.. నేనునారాయణ గూడ లోని కేశవ్ మెమోరియల్ స్కూల్లో,నిజాం కళాశాలలో హైదరాబాద్ లో విద్యాభ్యాసం పూర్తి చేశాను.ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి భూమి మీద ఆగడం లేదు..తెలంగాణ ప్రజలు చేదరించుకునే విధంగా మాట్లాడుతున్నాడు అన్ని అన్నారు.స్థానిక మల్కాజ్గిరి ఎంపీ అయిన నన్ను ప్రోటోకాల్ కు విరుద్ధంగా వ్యవహరించారు. పొంగులేటి ఫోన్ చేశారు. కానీ సరైన విధంగా సమన్వయం గా వ్యవహరించలేదు,రేవంత్ పిట్టల దొరలగా,బ్రోకర్ లాగా మాట్లాడుతున్నారు.ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి రేవంత్ రెడ్డి మాట్లాడే మాటలు కావు..మంత్రి గా కూడా పని చేయని రేవంత్ కి సరైన అవగాహన లేదు, ఐదేళ్లలో మల్కాజ్ గిరి ప్రజలను నట్టేట ముంచారు.ప్రజలకు నిలబడి పనులు చేయకుండా మోసం చేసిన వ్యక్తి, అబద్దాల పునాదులలో బ్రోకర్ మాటలతో బ్రతికిన వ్యక్తి రేవంత్,తాము అభివృద్ధికి,మూసి ప్రక్షాళనకు,హైడ్రా కు వ్యతిరేకం కాదు,ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి..కాంగ్రెస్ పెద్దలు సోనియా,రాహుల్, ప్రియాంక తో ఆరు గ్యారెంటీ ల పాలసీ విడుదల చేశారు.కానీమహిళలకు ఇవ్వాల్సిన పథకాలు అలాగే ఉన్నాయి,రైతుల విషయంలో రుణమాఫీ,రైతు భరోసా, పేరిట మోసం చేశారు.రైతులకు ఇచ్చిన హామీలలో



విఫలం అయ్యారు..మిగిలిన హామీలను పట్టించుకోకుండా పరిపాలిస్తున్నారు.మూసి ప్రక్షాళన కు లక్షా 50 వేల కోట్ల అంటున్నారు.అహ్మదాబాద్ లో అక్కడి బిజెపి ప్రభుత్వాలు సబర్మతి నది సుందరీకరణకు 1400 కోట్లు,గంగా ప్రక్షాళనకు 20 వేల కోట్లు ఖర్చు చేశారని రాజేందర్ అన్నారు.ప్రపంచంలో ఎక్కడ నది ప్రక్షాళనకు ఇంత డబ్బు ఖర్చు పెట్టలేదు,1 లక్ష 50 వేల కోట్లు ఎక్కడి నుండి తెస్తారు..ఆర్థిక వ్యవస్థ సరిగా లేదని అంటున్న రేవంత్ సమాధానం చెప్పాలి. పరిశ్యుద్ధ కార్మికులు,గ్రామ పంచాయితీలకు బిల్లులు ఇవ్వక ఇప్పటికీ అభివృద్ధి కుంటుపడింది అన్ని ఎంపీ ఈటల రాజేంద్రర్ అన్నారు..వారు మాట్లాడిన మాటలు వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. నేను అచ్చం తెలంగాణ మట్టి బిడ్డను.నన్ను బ్రతకవచ్చినాడు అంటే ఇంకా నేనే మాట్లాడాలి.కొడంగల్ లో బొందపెడితే ప్రశ్నించే గొంతుని గెలిపించండి అని మల్కాజ్గిరి అడిగితే గెలిపించారు.అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టారు. చెరువు బాధితులు ఎక్కువమంది మల్కాజ్గిరిలో ఉన్నారు అన్ని ఎంపీ ఈటెల రాజేంద్రర్ వెల్లడించారు... ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.ఎన్ వంశీ తిలక్, భానుకమల్లికార్జున్, బి.ఎన్ శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి,అజయ్ గౌడ్, విజయానంద్, ఏనుగుల తిరుపతి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

# విజయవంతంగా ముగిసిన భట్టి విక్రమార్క విదేశీ టూర్

మొత్తం మీద రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆయనతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం జరిపిన పర్యటన రాష్ట్ర విద్యుత్ రంగంలో అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు, సింగరేణిలో రక్షణతో కూడిన అధికోత్పత్తి మైనింగ్ పద్ధతుల ఆచరణకు ఊతం ఇవ్వనుంది. శు క్రవారం రాత్రి 9 గంటలకు డిప్యూటీ సీఎం అధికారుల బృందం హైదరాబాద్‌కు చేరుకోనుంది.ఈ పర్యటనలో ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పి.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్న విషయం తెలిసిందే. రెండు దేశాల ఈ పర్యటనలో ప్రధానంగా అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చిన అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలు, ఆధునిక మైనింగ్ విధానంలో అధికోత్పత్తిని సాధించే భారీ యంత్రాలు, వర్చువల్ రియాలిటీతో రక్షణ చర్యలు మొదలైనవి స్వయంగా పరిశీలించడమే కాక వీటిని రాష్ట్రంలో అమలు జరపడానికి శ్రీకారం చుట్టారు.అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్-2024లో కోమత్సు ,హిట్యాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను పరిశీలించారు. ముఖ్యంగా భూగర్భ గనుల్లో వర్చువల్ రియాలిటీ ద్వారా గని వెలుపలే ఉండి లోపల బొగ్గును తవ్వే సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది.సింగరేణి సంస్థ ఈ తరహా అత్యధిక బొగ్గు ఉత్పత్తిని సాధించే ఆధునిక యంత్రాలను సమకూర్చుకోవాలని, ప్రమాదరహిత సింగరేణిగా సంస్థను రూపుదిద్దడానికి ఆధునిక రక్షణ సాంకేతికతను అమలు చేయాలని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ ను కోరారు. అమెరికాలో అతిపెద్ద హూవర్ జల విద్యుత్ డ్యామ్‌ను సందర్శించిన సందర్భంగా అక్కడ అమలవుతున్న జల విద్యుత్ ఉత్పత్తి విధానాలు, రక్షణ చర్యలు తెలంగాణలో కూడా అమలు జరపాలని ఆయన ఎనర్జీ కార్యదర్శి రోనాల్డ్ రోస్‌ను కోరారు.జపాన్ పర్యటనలో యమనాషీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కేంద్రంలో గ్రీన్ హైడ్రోజన్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడానికి వినియోగించే సాంకేతికతను, సోలార్ విద్యుత్తును నిలువ ఉంచే ఫ్యూయల్ సెల్స్ టెక్నాలజీని పరిశీలించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేపట్టనున్న నేపథ్యంలో ఈ రెండు పద్ధతులపై దృష్టి సారించాలని, తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వృద్ధికి యమనాషీ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు.అలాగే తోషిబా పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న అత్యాధునిక ఫోటోవోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ టెక్నాలజీని పరిశీలించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ అవసరం ఎంతో ఉంటుందని, అలాగే అన్ని ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ఉద్దేశం ఉన్నందున ఫ్యూయల్ సెల్స్ ఆవశ్యకత కూడా ఉంటుందని భట్టి పేర్కొన్నారు.తోషిబా వారిని రాష్ట్రంలో ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ, స్వయంగా గానీ అక్కడ జరుగుతున్న పలు రకాల సెమీకండక్టర్‌లు, హై ఎఫిషియన్సీ బ్యాటరీలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సెమీకండక్టర్లు వంటివి పరిశీలించారు.సోలార్ విద్యుత్‌కు, ఇతర ఆధుపానాసోనిక్ కంపెనీ వారితో కూడా ఆధునిక ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలపై చర్చించారు.జపాన్ రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న బుల్లెట్ ట్రైన్‌లో ఆయన స్వయంగా ప్రయాణించారు. అత్యంత వేగంతో ప్రయాణించే ఈ తరహా ట్రైన్‌లను రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైల్వే శాఖకు విజ్ఞప్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

# రైల్వే ఉద్యోగులకు బోనస్.. 5భాషలకు ప్రాచీన హెూదా.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలివే..

దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్‌గా రూ.2028.57 కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.చెన్నై మెట్రో ఫేజ్ %××%కు ఆమోద ముద్ర చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ట్రాఫిక్‌ను సులభతరం చేయడంతో పాటు ఆర్థిక వృద్ధిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఫేజ్-2లో భాగంగా రూ.63,246 కోట్లతో దాదాపు 119కి.మీల మేర ఈ భారీ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కింద మూడు కారిడార్లుగా మొత్తం 120 స్టేషన్లు నిర్మించనున్నారు. 2027 నాటికి పూర్తి ఈ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఫేజ్-%××% పూర్తయి ఆపరేషన్‌లోకి వస్తే.. చెన్నై నగరంలో మొత్తంగా మెట్రో రైల్ నెట్‌వర్క్ 173 కి.మీకు చేరుకోనుంది.వ్యవసాయ సంబంధిత పథకాలన్నింటినీ రెండు ప్రత్యేక స్కీమ్‌ల కిందకు తీసుకొచ్చింది. పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన పథకాల ద్వారా సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత సాధించేందుకు రూ.లక్ష కోట్లతో అమలు చేయనుంది. పీఎం ఆర్‌కేవీవై పథకం సుస్థిర వ్యవసాయన్ని ప్రోత్సహించగా.. కృషోన్నతి యోజన ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధికి తోడ్పడనుంది. మొత్తం 18 పథకాలను ఈ రెండు స్కీమ్‌ల కింద రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తారు.దేశీయ అవసరాల్లో దాదాపు 50శాతానికి పైగా వంట నూనెల కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంట్లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్రం ప్రణాళిక రూపొందించింది. 2022-23 నాటికి 39 మిలియన్ టన్నుల నూనెగింజలను దేశంలో ఉత్పత్తి చేస్తుండగా.. 2030-31 నాటికి 69.7 మిలియన్ టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, సాగును అదనంగా 40 లక్షల హెక్టార్లు పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

## అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించేందుకే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

రంగారెడ్డిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే : రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే సాగుతున్న తీరును ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధికారులతో కలసి పరిశీలించారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తూ అధికారులకు ఖచ్చితమైన సమాచారం ఇస్తూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రామాణికమని వివరించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాల సేకరణ ప్రారంభించారు.అర్హులైన వారందరూ తమ సమాచారాన్ని యంత్రాంగానికి అందించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కంటోనిపల్లి గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను అధికారులు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ పర్యవేక్షించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రెండో వార్డులో సాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రయోగాత్మక సర్వేను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలించారు. సర్వే పక్కాగా జరిపించాలని అధికారులకు సూచించారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం రాగిపాడులో డిజిటల్ కార్డుల సర్వేను హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు.

## ప్రజల జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలపై ఆయా శాఖలు దృష్టి పెట్టాలి..

నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7 శాతం గ్రోత్ రేట్ సాధించిందన్నారు. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రివర్స్ నిర్ణయాలతో వృద్ధి రేటు 10.59 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. 2019లో తెలంగాణతో పోల్చితే ఏపీ జీఎస్డీపీలో వ్యత్యాసం కేవలం 0.20 శాతం ఉండేది.. ఆ వ్యత్యాసం 2024కు 1.5 శాతానికి పెరిగిందన్నారు. 2014-15 మధ్య ఏపీ ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా.. 2019 నాటికి రూ.1,54,031 పెరిగిందని చంద్రబాబు వెల్లడించారు.అలాగే, తెలుగుదేశం హయాంలో తలసరి ఆదాయం వృద్ధి 13.21 శాతం ఉండగా.. గత ప్రభుత్వంలో అది 9.06 శాతం మాత్రమే నమోదు అయిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజల తలసరి ఆదాయంలో వృద్ధి పడిపోయి.. ప్రజల జీవన ప్రమణాలు దెబ్బతిన్నాయన్నారు. నాడు తెలంగాణకు ఏపీ మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం కేవలం 0.16 శాతం మాత్రమే ఉంటే.. గత ప్రభుత్వంలో అది 1.84 శాతానికి పెరిగింది.. దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉంది.. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ శాఖలు విజన్ సిద్ధం చేసుకుని నిర్ధిష్ట లక్ష్యాలతో పని చేయాలన్నారు. కొన్ని శాఖలు బాగా వెనకబడి ఉన్నాయి.. వారు యాక్టివ్ కావాల్సిన అవసరం ఉంది.. త్వరలో ఈ మూడు రంగాల్లో లక్ష్యాలపై ప్రణాళికలతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. జనవరిలో %ూ%4 విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నాం.. ఈ విధానంతో ఆర్థికంగా అట్టడుగున ఉన్న 10 శాతం మందని పైకి తెసుకువచ్చేందుకు సహాయం చేయాలని చంద్రబాబు అన్నారు.

# భారీ వర్షాలు మరో మూడు రోజులపాటు

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిసిన సమాచారం మేరకు శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.శనివారం నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల వానలు కురుస్తాయని పేర్కొంది.హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. భారీగా కురిసిన వానతో నగరవాసులు తడిసి ముద్దయ్యారు. వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.రోడ్లపై వాన నీరుతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. ఇందిరా పార్కు ధర్నా చౌక్, బాగ్ లింగంపల్లి, లోయర్ ట్యాంక్‌బండ్, ఆర్టీసీ క్రాస్ రోడ్, గాంధీ నగర్, జవహర్ నగర్, కవాడిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది.బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వరద నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉద్యోగం ముగించుకుని ఇంటికి బయలు దేరిన ఉద్యోగులు, విద్యార్థులు వర్షానికి తడిచిపోయారు.మరోవైపు హైదరాబాద్‌కు ఎల్లో హెచ్చరికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమయ్యింది. నిలువకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు రోడ్లను క్లియర్ చేయాలని, అనుక్షణం అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. నగరంలో బల్దియా యంత్రాంగమంతా వేగంగా స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# రేవంత్‌కు ఈటల సవాల్.. ముక్కు నేలకు రాస్తా అంటూ..



**శాసనసభ /హైదరాబాద్ :** తెలంగాణలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాడీవేడీగా మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. సెక్యూరిటీ లేకుండా మూసీ పరివాహక ప్రాంతానికి వెళ్దాం. ప్రజలు రేవంత్‌ను శభాష్ అంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఛాలెంజ్ చేశారు. దీంతో.. కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టు రాజకీయం మారిపోయింది. మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..రేవంత్ రెడ్డికి నిజంగా దమ్ము, ధైరం ఉంటే మూసీ బాధితుల వద్దకు ఇద్దరం కలిసే వెళ్దాం. సెక్యూరిటీ లేకుండా అక్కడికి పోదాం. మూసీ పరివాహక ప్రాంత ప్రజల రేవంత్‌ను శభాష్ అంటే నేను అక్కడే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతాను. అలాగే, రాజకీయ సన్యాసం తీసుకుంటా. రేవంత్.. ప్రజల చేత ఇంతలా తిట్టించుకున్న నాయకుడు ఎవరూ లేరు. గర్భిణీ అని చూడకుండా ఇళ్లు ఖాళీ చేయమని బెదిరించారు. కడుపు మండి మాట్లాడిన పేదలను ఐదు వేలకు అమ్ముడుపోయారని రేవంత్ అన్నారు. అద్దాల మేడలో కూర్చొన్న రేవంత్‌కు అధికారం నెత్తికెక్కింది. మూసీ ప్రక్షాళన రోడ్ మ్యాప్ ఏంటీ ? డీపీఆర్ ఏంటీ?. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. లక్షన్నర కోట్లతో ప్రాజెక్ట్ అంటే మాకు అనుమానాలు వస్తున్నాయి. ఆరు గ్యారంటీల అమలుకు డబ్బులే లేవు అంటున్నారు. ఆర్థిక వ్యవస్థ నాశనమైందని రేవంత్ చెబుతున్నారు. మరి.. లక్ష యాభై వేల కోట్లు ఎక్కడి నుండి తెస్తున్నారు. కేసీఆర్ కూడా గతంలో ఇలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. రేవంత్ అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. మోసం, అబద్ధానికి మారుపేరు రేవంత్' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

## దసరాలోగా 2 లక్షలకుపైగా రుణ మాఫీ



**శాసనసభ /హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షలలోపు రుణం ఉన్న రైతులకు మాఫీ చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రూ.2 లక్షల పైన ఉన్న వారికి దసరాలోపు మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గురువారం కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలని సూచించారు. డిజిటల్ కార్డు వివరాల నమోదులో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

# పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

### ఇండ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యమా?



**శాసనసభ /హైదరాబాద్ :** పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్‌రెడ్డి పాలన ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆ రాయి ఇప్పుడు రైతులపై పడిందన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూరులో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. డప్పూరు, మల్గి, వడ్డీ గ్రామాల్లో 2,003 ఎకరాల భూములను ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం సేకరిస్తున్నదన్న ఆయన ఏటా మూడు పంటలు పండించే భూములను గుంజుకోవడం న్యాయమా అని ప్రశ్నించారు. ఫార్మాసిటీ కోసం హైదరాబాద్ పక్కనే 15వేల ఎకరాలను గత ప్రభుత్వం సేకరిస్తే దానిని ఫోర్త్ సిటీగా మారుస్తానని చెప్పి ఫార్మాసిటీని పచ్చని పల్లెల్లో ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారి 15వేల ఎకరాలతో వ్యాపారం చేయాలనుకుంటున్నారని హరీశ్ విమర్శించారు. మూసీనది సుందరీకరణ పేరిట ఇండ్లు కూల్చడం, ఫార్మాసిటీ కోసం భూములు కొల్లగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా అని ఆయన ధ్వజమెత్తారు. మూసీని శుద్ధి చేస్తా అంటూనే పాలవంటి మంజీరాను విషపూరితంగా మారుస్తారా అని హరీశ్ ప్రశ్నించారు. రైతులు భయపడాల్సిన పనిలేదని, తన ప్రాణాలు అడ్డుపెట్టయినా భూములను కాపాడుతానని ఆయన భరోసా కల్పించారు. డప్పూరు రచ్చబండ కార్యక్రమంలో పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. భూములను నమ్ముకొనే పిల్లలను చదివిస్తున్నామని, కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. ప్రాణాలు పోయినా భూములివ్వబోమన్నారు.

# రాజకీయం వేరు.. కేటీఆర్, బండి నా మిత్రులే: శ్రీధర్‌బాబు



**శాసనసభ /హైదరాబాద్ :** తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు మంత్రి శ్రీధర్ బాబు. ప్రభుత్వ కార్యక్రమాలను కావాలనే ప్రభుత్వం బద్నాం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కొండా సురేఖ వ్యాఖ్యలపై పీసీసీ స్పందనే తన స్పందన అని చెప్పుకొచ్చారు. అలాగే, హైడ్రాకు ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించిందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మూసీ అభివృద్ధి, సంక్షేమంపై చాలెంజ్ చేస్తాం. కత్తుల యుద్ధం చేస్తా అంటే నాలుగేళ్ల తర్వాత చేద్దాం. సంచులు మోసింది వాళ్లే అందుకే అదే గుర్తుకు వస్తుంది. ఇష్టారాజ్యం, అడ్డగోలుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తే సహించేది లేదు. పార్టీ పరంగా ఏమైనా తప్పులు జరిగితే రాహుల్ గాంధీ సరిచేస్తారు. అంతేగానీ మూసీ ప్రాజెక్ట్‌కు రాహుల్ గాంధీకి ఏం సంబంధం లేదు. రాహుల్ గాంధీపై విమర్శలు చేసి రెండు రోజులు వార్తల్లో ఉండాలి అనుకుంటున్నారు. డిజిటల్ కార్డుల కార్యక్రమంలో ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందలేదు అంటే సమీక్ష చేస్తాం. ప్రోటోకాల్ అంశంలో ఎక్కడ తప్పు జరిగిందో రివ్యూ చేస్తాం. ప్రభుత్వ కార్యక్రమాలను కావాలనే బీఆర్ఎస్ నేతలు బద్నాం చేస్తున్నారు. జహీరాబాద్‌కు పొల్యూషన్ కంపెనీలు అని హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. జహీరాబాద్‌కు త్వరలో హ్యుందాయ్ సంస్థ వస్తుంది.. అది పొల్యూషన్ సంస్థనా?. తెలంగాణ నుంచి కంపెనీలు తరలి వెళ్తున్నాయి అనేది అవాస్తవం. కొండా సురేఖ వ్యాఖ్యలపై పీసీసీ స్పందనే నా స్పందన. నేను ఇప్పటి వరకు ఎవరిని వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదు.. చేయను. కేటీఆర్, బండి సంజయ్, హరీష్ రావు నా మిత్రులు. కేవలం రాజకీయ అభిప్రాయాలు మాత్రమే వేరు' అంటూ కామెంట్స్ చేశారు.

# కేటీఆర్‌పై మరోసారి కొండా సురేఖ సంచలన ఆరోపణలు



**శాసనసభ /హైదరాబాద్ :** తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు వర్సెస్ మంత్రి కొండా సురేఖ అన్నట్టుగా మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటికే కేటీఆర్‌పై సంచలన ఆరోపణలు చేసిన కొండా సురేఖ..తాజాగా మరిన్ని కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ ఓడిపోవడానికి కేటీఆర్ ప్రధాన కారణమని కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ గురువారం గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ..'సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని నాపై కేటీఆర్ పిచ్చి రాతలు రాయిస్తున్నారు. తొమ్మిది హామీలు అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస ఓడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆర్ ఏదో చేశాడన్న ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు తీసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ సమావేశాల రోజు కేసీఆర్ కనిపించారు. అప్పటి నుంచి మళ్లీ కేసీఆర్ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఏం చేస్తున్నారో తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. గజ్వేల్‌లో పోటీ చేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఓటర్లు చెప్పుకుంటున్నారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్‌కు మతిభ్రమించింది. ఏదేదో మాట్లాడుతున్నాడు. హైడ్రా, మూసీ అంటూ ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నాడు. మూసీ ప్రక్షాళనకు తెరలేపింది బీఆర్ఎస్ పార్టీనే. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలని హెచ్చరిస్తున్నాను. ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపితే ఊపేక్షించేది లేదు. రేవంత్ నాయకత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది. అలాగే, పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. బీజేపీతో కలిసి బీఆర్ఎస్ నేతలు పనిచేశారు' అంటూ సంచలన ఆరోపణలు చేశారు.

# మంచిర్యాలలో మార్కెట్ కూల్చివేత!



**మంచిర్యాల,శాసనసభ /హైదరాబాద్ : అక్టోబర్ 3:** మంచిర్యాల జిల్లా కేంద్రం లో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి అధికారిక పార్టీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (పీఎస్సా ర్) తెరలేపారు. మాతా, శిశు హాస్పిటల్ ఏర్పాటు పేరిట జిల్లా కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను గురువారం నుంచి కూల్చివేయిస్తున్నారు (ఇంకా కొనసాగుతున్నది). గత ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీకి ఒక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉండాలన్న ఉద్దేశంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఈ నిర్మాణాన్ని చేపట్టింది. ఇందుకోసం రూ.7.20 కోట్లు కేటాయించి, దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే పనులను కూడా పూర్తి చేసింది. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఆ భవనాన్ని అర్ధాంతరంగా కూలుస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉన్న రెండెకరాల ఆరు గుంటల భూమితోపాటు దాని వెనక ఉన్న ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్డీవో కార్యాలయం ఉన్న భవనం సహా వాటర్ ట్యాంక్ మొత్తం 4.22 ఎకరాలు ఇప్పుడు నూతన హాస్పిటల్ నిర్మాణానికి ఇచ్చారు. దీంతో ఈ రోజు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూలుస్తుండగా.. త్వరలో రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ (ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయానికి కేటాయించారు), రూ.3 కోట్లు విలువ చేసే పాత ఆర్అండ్‌బీ ఆఫీస్ భవనాలను కూడా కూల్చనున్నట్టు తెలిసింది. హాస్పిటల్ నిర్మాణం పేరిట దాదాపు రూ.10 కోట్ల విలువైన ఆస్తులను కూలుస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు.

### జీవో రాకముందే కూల్చివేతలు

4.22 ఎకరాల్లో హాస్పిటల్ నిర్మించాలంటే మున్సిపాలిటీ సహా ఆర్అండ్‌బీ శాఖలు ఆ భూమిని టీఎస్ఎంఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు అప్పగించాలి. ఈ మేరకు మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ శాఖలు ఆ భూమిని టీఎస్ఎండీసీకి ఇస్తున్నట్టు లేఖలు అందజేశాయి. కానీ.. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సర్కారు ఆర్డర్ రాలేదని, ఎలాంటి ఆదేశాలు రాకముందే ఇలా కూల్చివేతలు చేస్తున్నారని టీఎస్ఎండీసీకి అనుసంధానంగా పని చేసే జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ఇలా ఏ ఆర్డర్ లేకుండా ఎలా కూల్చేస్తున్నారనేది అర్థం కావడం లేదు. అసలు ఆ అధికారం వీరికి ఎవరిచ్చారు? అనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేస్తుండటంపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌ను వివరణ కోరగా.. కూల్చివేతల విషయం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లే చూసుకుంటున్నారని చెప్పారు. తమకు ఈ విషయంలో సంబంధం లేదని, కూల్చివేత పర్మిషన్లు కూడా వాళ్లే తీసుకుంటారని స్పష్టంచేశారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ డీఈ రమేశ్‌ను వివరణ కోరగా.. స్థలాన్ని టీఎస్ఎండీసీకి అప్పగించామని, కూల్చివేతపై తమకు ఎలాంటి నోటీసు రాలేదని, అది పూర్తిగా మెడికల్ అండ్ హెల్త్ అధికారులే చూసుకుంటున్నారని చెప్పారు. తమ కార్యాలయాలు ఖాళీ చేసేందుకు 15 రోజుల సమయం ఇచ్చారని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు మాత్రం అధికారికంగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పేర్కొంటున్నారు. ఇలా ఏ శాఖ అధికారిని అడిగినా ఎవరికి వారు కూల్చివేతపై తప్పించుకునే సమాధానాలు చెప్పడం గమనార్హం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చడానికి ముందు మంచిర్యాల మార్కెట్‌రోడ్డులో సెట్‌బ్యాక్ లేకుండా ఉన్న నిర్మాణాలను కూడా మున్సిపల్ అధికారులు కూల్చారు. దీంతో కూల్చివేతలపై స్థానికులు మండిపడుతున్నారు.

### ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎందుకు ఆగింది?

ప్రజలకు సుస్థిరమైన పాలన అందించడంలో ఈ ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన మంచి పనులన్నీ ఆగిపోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మంచిర్యాల ప్రజల కోసం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ మొండి గోడలతో కనపడుతున్నది. ప్రజలకు ఉపయోగపడే ఈ బిల్డింగ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆపేసింది. ఏ కారణంతో ఆపేసిందో చెప్పాలె.

# ఉపాధి కోసం నేతన్నల ఆందోళన సిరిసిల్ల పట్టణంలో భారీ ధర్నా



**రాజన్న సిరిసిల్ల,శాసనసభ / అక్టోబర్ 3 :** సిరిసిల్ల నేత కార్మికులు మరోమారు ఆందోళనకు దిగారు. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీవై నగర్‌లో చేనేత జౌళీ శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని లభించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీ నిలిపి వేయడం వల్ల ఉపాధి పనిలేక అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాలు నేడు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని తెలిపారు. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. కార్మికులకు రావాల్సిన యార్న్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు కలెక్టర్, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించిన స్పందించడం లేదని చెప్పారు. వెంటనే యార్న్ సబ్సిడీ విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి ఘటించడంతో ఉద్రిక్తత



**దుబ్బాక,శాసనసభ / అక్టోబర్ 3:** సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపించారు. వారిని బీఆర్ఎస్ శ్రేణులు నిలువరించడంతో ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలోని శివాజీ చౌక్ వద్దకు ఎమ్మెల్యే కాన్వాయ్‌లో వస్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతలోనే కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వాహనంపై కోడిగుడ్లు విసిరేందుకు ప్రయత్నించగా అవి పక్కన రోడ్డుపై పడ్డాయి. కాంగ్రెస్ నాయకుల కవ్వింపు చర్యలపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల జోక్యంతో రెండు పార్టీల వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఘటనపై దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి దొంగే .. దొంగ అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ సర్కారు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నదని, అధికారంలో ఉన్నామనే సోయి తెచ్చుకుని బాధ్యతాయుతమైన పాలన అందించాలని హితవు పలికారు. దిగజారుడు రాజకీయాలు, ప్రతిపక్షాలను వేధించే రాజకీయాలు మానుకోవాలని కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు.

# 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తే లక్ష్యం..



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణలో 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా గురువారం ఆయన క్యోటో నగరానికి సమీపంలోని ప్రముఖ సెమీకండక్టర్ల పరిశ్రమ రోహ్మ్‌ను సందర్శించి నిర్వాహకులతో చర్చలు జరిపారు. తొలుత రోహ్మ్ కంపెనీ ప్రెసిడెంట్ ఇనో, కంపెనీ ఉన్నతాధికారులు తకహసి, అండో తదితరులు డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికారు. వర్చువల్‌గా వివిధ దేశాల్లో తమకు గల సెమీకండక్టర్ల పరిశ్రమలను, అక్కడి ఉత్పత్తి ప్రక్రియలను భట్టికి వారు వివరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో హరిత ఇంధనాన్ని పెంచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఈ దృష్ట్యా సెమీకండక్టర్ల ఆవశ్యకత పెరిగిందని తెలిపారు. సెమీకండక్టర్ల పరిశ్రమను సొంతంగా లేదా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో గానీ ఏర్పాటు చేయడానికి ముందుకురావాలని రోహ్మ్ కంపెనీ అధికారులను ఆహ్వానించారు. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామని వారు చెప్పారు. సాయంత్రం పానాసోనిక్ కంపెనీ కార్యాలయంలో ఆ కంపెనీ ప్రెసిడెంట్ నబి నకానీషితో భట్టి సమావేశమై ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల గురించి మాట్లాడారు. గత నెల 24న ప్రారంభమైన విదేశీ పర్యటనలో భాగంగా తొలుత ఆయన వారం పాటు అమెరికాను సందర్శించగా.. ఆ తర్వాత జపాన్‌లో మూడ్రోజుల పాటు కొనసాగింది. రాజ్యమా అని ఆయన ధ్వజమెత్తారు. మూసీని శుద్ధి చేస్తా అంటూనే పాలవంటి మంజీరాను విషపూరితంగా మారుస్తారా అని హరీశ్ ప్రశ్నించారు. రైతులు భయపడాల్సిన పనిలేదని, తన ప్రాణాలు అడ్డుపెట్టయినా భూములను కాపాడుతానని ఆయన భరోసా కల్పించారు. డప్పూరు రచ్చబండ కార్యక్రమంలో పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. భూములను నమ్ముకొనే పిల్లలను చదివిస్తున్నామని, కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. ప్రాణాలు పోయినా భూమిలివ్వబోమన్నారు.

శాసనసభ
తెలుగు దినపత్రిక
శుక్రవారం 04 అక్టోబర్ - 2024

# 'గుడివాడ రౌడీ'.. విలన్ పాత్రధారి మోహన్‌రాజ్ కన్నుమూత



''అచ్చుతప్పు.. మన పేరు గుడివాడ రాయుడు.. 'రాయుడు' అని నోరు తిరగక రౌడీ అంటున్నారు'' అంటూ 'లారీ డ్రైవర్' సహా తెలుగు చిత్రాల్లో తనదైన విలనిజాన్ని పండించిన నటుడు మోహన్‌రాజ్ (72) ఇక లేరు.'కిరిక్కాడాన్ జోస్' పేరుతో మలయాళంలో వందల చిత్రాల్లో నటించి మెప్పించిన ఆయన తిరువనంతపురంలో తుది శ్వాస విడిచారు. నటుడు, దర్శకుడు, పి.దినేశ్ పనికర్ ఈ విషయాన్ని తెలియజేస్తూ విచారం వ్యక్తం చేశారు. మోహన్‌రాజ్‌కు భార్య ఉష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నాలుగు రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న మోహన్‌రాజ్‌ను వెంటిలేటర్‌పై ఉంచారు. గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. గత కొంతకాలంగా పార్కిన్సన్స్‌తో బాధపడుతున్న మోహన్‌రాజ్‌కు ఇటీవల గుండె పోటు కూడా వచ్చింది. చికిత్స నిమిత్తం ఆయన్ను చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లిపోవాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను తిరువనంతపురంలోని కంజిరంకులం తీసుకురాగా, అక్కడే కన్నుమూశారు.'కిరిక్కాడాన్ జోస్'గా మలయాళంలో మోహన్‌రాజ్ చాలా ఫేమస్. 1989లో సిబి మలయిల్ దర్శకత్వంలో వచ్చిన 'కిరీదామ్'తో మంచి పేరు తెచ్చుకున్నారు. సిబి మలయిల్ తను తీయబోయే చిత్రానికి 6 అడుగులకు పైగా ఎత్తు, 100 కిలోల భారీ శరీరం కలిగిన కొత్త విలన్ కోసం వెతుకుతుండగా మోహన్‌రాజ్ కనిపించారు. అప్పటికి ఆయన కేంద్ర ప్రభుత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సినిమాలపై ఆసక్తితో 'మూన్నం మూర' చిత్రంలో నటించారు. అది చూసిన సిబి తన విలన్ పాత్రకు మోహన్‌రాజ్‌ను ఎంపిక చేశారు. ఆయన అంచనాలను నిజం చేస్తూ తన నటనతో అలరించారు. ఆ తర్వాత తమిళ, తెలుగు చిత్రాల్లో నటించి మెప్పించారు. తెలుగులో వచ్చిన 'లారీ డ్రైవర్', 'స్టువర్టుపురం పోలీస్ స్టేషన్', 'చినరాయుడు', 'నిప్పు రవ్వ', 'శివయ్య', 'అసెంబ్లీ రౌడీ', 'సమర సింహారెడ్డి', 'నరసింహనాయుడు', 'చెన్న కేశవరెడ్డి', 'శివమణి' తదితర చిత్రాల్లో కథానాయకుడికి దీటుగా ప్రతినాయకుడిగా అలరించారు. తెలుగులో ఆయన నటించిన చివరి చిత్రం 'శివశంకర్'. మోహన్‌బాబు కథానాయకుడిగా రూపొందిన చిత్రమిది. మోహన్‌రాజ్ మృతిపట్ల మలయాళ సినీ పరిశ్రమ విచారం వ్యక్తం చేసింది.

## ఇప్పుడాయన.. నా కుటుంబ సభ్యుడు



హైదరాబాద్: దర్శకుడు కొరటాల శివ పై నటుడు ఎన్టీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'దేవర' సినిమా సక్సెస్ పార్టీలో ఆయన మాట్లాడారు.''బృందావనం' సినిమాతో మా ప్రయాణం మొదలైంది. ఇప్పుడాయన నా కుటుంబ సభ్యుడిగా మారారు. 'దేవర 2' చిత్రీకరణ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అని అన్నారు. నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ గురించి మాట్లాడుతూ.. ''నాకు, కల్యాణ్ రామ్ అన్నయ్యకు హరికృష్ణ కొసరాజు వెన్నెముకలాంటి వారు. ఆయన వల్లే ఎన్టీఆర్ ఆర్ట్స్ ఉంది'' అని పేర్కొన్నారు.ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన 'దేవర' ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. టీమ్.. భారీ స్థాయిలో సెలబ్రేషన్స్ చేయాలనుకుంది. కానీ, అనుమతి లభించకపోవడంతో ఓ హోటల్‌లో ఈవెంట్ ఏర్పాటు చేశారు. చిత్ర బృందంతోపాటు రాజమౌళి తదితరులు హాజరయ్యారు.

## ఎన్టీఆర్ అభిమానులకు గుడ్‌న్యూస్.. థియేటర్‌లో దావూదీ సాంగ్ వచ్చేస్తోంది!



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందించిన యాక్షన్ థ్రిల్లర్ 'దేవర'జాన్వీకపూర్ కథానాయిక. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. విడుదలకు ముందే ఇందులోని పాటలు శ్రోతలు, నెటిజన్లను అలరించాయి. ముఖ్యంగా 'దావుదీ' సాంగ్ యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోయిం ది. అయితే, థియేటర్‌లో ఎప్పుడెప్పుడు ఈ మాస్ సాంగ్ వస్తుందా? అని ఎదురు చూసిన సగటు ప్రేక్షకుడు నిరాశ చెందాడు. అనివార్య కారణాల వల్ల ఈ పాటను సినిమాలలో ప్రదర్శించ లేదు.ఇప్పుడు 'దేవర' చిత్ర బృందం ఎన్టీఆర్ అభిమానులు, ప్రేక్షకులకు శుభవార్త చెప్పింది. ఈ పాటను సినిమాకు జత చేయనున్నట్లు ప్రకటించిం ది. శుక్రవారం నుంచి అన్ని స్క్రీన్స్‌లోనూ ఈ పాటను ప్రదర్శించనున్నట్లు ప్రకటించింది. కొన్ని థియేటర్లు రేపు ఉదయం నుంచే పాటను ప్రదర్శించనుండగా, సాయంత్రం సమయానికి పూర్తి స్థాయిలో అన్ని స్క్రీన్‌లలో అందుబాటులోకి తీసుకురానున్నారు. 'దేవర' టీమ్ ప్రకటన పట్ల తారక్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. నకాష్ అజీజ్, ఆకాశ ఆలపించారు.'దేవర' ఎంత వసూళ్లు చేసిందంటే.. ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే హవా కొనసాగించిన 'దేవర'.. విడుదలయ్యాక కూడా మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంటోంది . ఇప్పటివరకు రూ.396 కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం తాజాగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ అలరించగా విలన్‌గా సైఫ్ అలీఖాన్ కనిపించిన సంగతి తెలిసిందే.

## ఆ డైలాగ్‌పై అభ్యంతరం.. 'వేట్టయాన్'పై కోర్టులో కేసు



చెన్నై: రజనీకాంత్ , అమితాబ్ బచ్చన్ కీలక పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'వేట్టయాన్' . టీజే జ్ఞానవేల్ దర్శకుడు.అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ అక్టోబరు 10న తమిళ, తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మధురై హైకోర్టులో పిల్ దాఖలైంది. ఇటీవల విడుదలైన 'వేట్టయాన్' టీజర్‌లో సంభాషణలు చట్టవిరుద్ధంగా ఎన్‌కౌంటర్‌లను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని పేర్కొంటూ ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సినిమా విడుదల కాకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.సెప్టెంబరు 20న ఆ సంభాషణలను తొలగించడం లేదా మ్యూట్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సుబ్రమణియన్, జస్టిస్ విక్టోరియా గౌరీల ధర్మాసనం సీబీఎఫ్‌సీ (కేంద్ర చలన చిత్ర సెన్సార్ బోర్డు), లైకా ప్రొడక్షన్స్‌కు నోటీసులు జారీ చేసింది. సినిమాపై మధ్యంతర నిషేధం విధించాలన్న విన్నపాన్ని మాత్రం తోసిపుచ్చింది. సీబీఎఫ్‌సీ, లైకా ప్రొడక్షన్స్ స్పందనను బట్టి తదుపరి విచారణ ఉంటుందని తెలిపింది.

## బ్రేకప్ అంటూ రితేశ్ మెసేజ్.. కంగారుపడ్డా: జెనీలియా



'బొమ్మరిల్లు'తో తెలుగువారికి బాగా చేరువైన నటి జెనీలియా . బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ తో వివాహం అనంతరం ఆమె ముంబయిలో సెటిలైన విషయం తెలిసిందే.ఈ జంటకు సినీ ప్రియుల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. తరచూ సరదా వీడియోలు చూస్తూ క్యూట్ కపుల్‌గా పేరు తెచ్చుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జెనీలియా.. తన భర్త రితేశ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. రితేశ్ చాలా సింపుల్, లవ్లీ పర్సన్ అన్నారు. ఆయన్ని పెళ్లి చేసుకోవడం తాను తీసుకున్న మంచి నిర్ణయాల్లో ఒకటన్నారు. డేటింగ్‌లో ఉన్నప్పుడు ఊహించని చర్యలతో ఆయన షాక్‌కు గురిచేసేవాడన్నారు.''మేము డేటింగ్‌లో ఉన్నప్పుడు ఒక సంఘటన జరిగింది. దానిని నేను ఎప్పటికీ మర్చిపోలేను. రితేశ్‌కు ఆలస్యంగా నిద్రపోవడం అలవాటు. నేనేమో చాలా త్వరగా నిద్రలోకి జారుకుంటా. ఓరోజు ఏమైందో ఏమో తెలియదు.. అర్ధరాత్రి 1 గంటకు రితేశ్ నాకొక సందేశం పంపారు. ''ఇక, అంతా అయిపోయింది'' అంటూ అదొక బ్రేకప్ సందేశం. తెల్లవారుజామున ఆ సందేశం చూసి నేను షాకయ్యా. చాలా బాధగా అనిపించింది. ఏం జరిగిందో? ఆయన ఎందుకు ఇలా చెప్పారో? అర్థం కాక సతమతమయ్యా. నిద్రలేచిన తర్వాత తాను పంపిన సందేశం గురించి రితేశ్ పూర్తిగా మర్చిపోయారు. ఫోన్ చేసి ''ఏం చేస్తున్నావు?'' అని అడిగారు. నాకు కోపం వచ్చేసింది. ''ఇకపై మనం మాట్లాడుకోకపోవడం మంచిది. నువ్వేం అనుకుంటున్నావు. ఏం జరగనట్లు అలా, ఎలా మాట్లాడుతున్నావు?'' అని కేకలు వేశా. రాత్రి జరిగింది గుర్తు చేసుకుని.. తాను కేవలం జోక్‌గా ఆ సందేశం పంపినట్లు చెప్పారు'' అని జెనీలియా తెలిపారు.2003లో విడుదలైన 'తుజే మేరీ కసమ్' కోసం జెనీలియా, రితేశ్ తొలిసారి కలిసి వర్క్ చేశారు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో వీరి మధ్య ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. ఆపై దాదాపు పదేళ్లు డేటింగ్‌లో ఉన్నారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో 2012లో వివాహం చేసుకున్నారు. 2022లో వీరిద్దరూ కలిసి యాక్ట్ చేసిన 'వేద్' మంచి విజయాన్ని అందుకుంది. 'మజిలి'కి రీమేక్‌గా తెరకెక్కిన మరాఠీ మూవీ ఇది.

## బంగ్లాతో తొలి టీ20 తుది జట్టు – తెలుగు కుర్రాడికి నో ఛాన్స్!



టీమ్ ఇండియా – బంగ్లాదేశ్ మధ్య జరగనున్న తొలి టీ20 తుది జట్టులో ఎవరు ఉంటారన్న విషయంపై ఊహాగానాలు టీమ్ ఇండియా – బంగ్లాదేశ్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 6 నుంచి మొదలు కానుంది. మొదటి టీ20 అక్టోబర్ 6న గ్వాలియర్ వేదికగా జరగనుంది. రెండో టీ20 అక్టోబర్ 9న ఢిల్లీ వేదికగా, మూడో టీ20 అక్టోబర్ 12న హైదరాబాద్ వేదికగా జరుగనున్నాయి. ఇక ఈ సిరీస్ కోసం ఇప్పటికే టీమ్ ఇండియా, బంగ్లాదేశ్ జట్లను ప్రకటించారు.అయితే మొదటి టీ20 ప్రారంభానికి మరో రెండు రోజుల సమయమే మిగిలి ఉంది. దీంతో ఆ మ్యాచ్ కోసం తుది జట్టులో ఎవరు ఉంటారన్న విషయంపై ఊహాగానాలు మొదలైపోయాయి. ఈ సిరీస్ కోసం ఇప్పటికే సీనియర్లకు విశ్రాంతిని ఇచ్చారు భారత సెలెక్టర్లు. యువ జట్టును సెలెక్ట్ చేశారు. ఈ టీమ్‌కు సూర్యకుమార్ నాయకత్వం వహిస్తున్నాడు. సంజు శాంసన్, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్, శివమ్ దూబె, రింకూ సింగ్, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, మయాంక్ యాదవ్, అర్షదీప్ సింగ్, జితేశ్ శర్మ, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి ఉన్నారు.ఓపెనర్లుగా ఆ ఇద్దరు – యశస్వి జైశ్వాల్, శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతి ఇచ్చిన నేపథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారని తెలిసింది. వన్ డౌన్‌లో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, ఆ తర్వాత రియాన్ పరాగ్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్ వరుసగా క్రీజులోకి వచ్చే అవకాశం ఉంది.అతడికి ఎదురుచూపు! – పేస్ ఆల్‌రౌండర్లుగా హార్దిక్, దూబే తుది జట్టులో ఉండటం దాదాపుగా ఖరారైంది. దీంతో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి ఎదురుచూపులు తప్పేలా లేదు. స్పెషలిస్ట్ స్పిన్నర్ కోటాలో రవి బిష్ణోయ్ ఎంపిక దాదాపుగా ఖరారు అయినట్టే. వరుణ్ చక్రవర్తికి నిరాశ తప్పదు. పేసర్ల కోటాలో అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్ తుది జట్టులో ఉండే ఛాన్స్ ఎక్కువగా ఉంది.టీమ్ ఇండియా తుది జట్టు (అంచనా) సంజు శాంసన్, అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, అర్షదీప్ సింగ్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్

## 17 ఏళ్లలో 600 శాతం పెరిగిన ఐపీఎల్ ఫ్రాంచైజీల లిమిట్ - తొలి సీజన్‌లో ఎంతంటే?



2008లో ప్రారంభమైన ఐపీఎల్, ఇప్పటికీ నిర్విరామంగా కొనసాగుతోంది. అయితే ప్రారంభ సీజన్‌లో వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేయడం కోసం ఒక్కో ఫ్రాంఛైజీ దగ్గర రూ.22.5కోట్లు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ లిమిట్‌ను కాస్త ఏకంగా రూ.120 కోట్ల వరకూ పెరిగింది. అంటే దాదాపు 600 రెట్లు పెరిగిందన్నమాట.భారత్‌లో ఐపీఎల్‌కు ఉండే ఆదరణే వేరు. ఈ లీగ్‌లో ఆడేందుకు దేశవిదేశాల్లోని అంతర్జాతీయ ఆటగాళ్లు సైతం మొగ్గు చూపుతారు. అలాగే ఐపీఎల్ మ్యాచ్‌లను చూసేందుకు ప్రేక్షకులు సైతం విపరీతంగా ఆసక్తి కనబరుస్తారు. అందుకే ఐపీఎల్ శాటిలైట్ రైట్స్ వంటివి భారీ ధర పలుకుతుంటాయి. కాగా, 2008లో ప్రారంభమైన ఐపీఎల్ ఇప్పటివరకు 17 సీజన్లు పూర్తి చేసుకుంది. అయితే ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి ఒక్కో ఫ్రాంచైజీ దగ్గర 22.5 కోట్లు ఉండేది. ప్రతిసారి పెరుగుకుంటూ ఇప్పుడు రూ.120 కోట్లకు చేరింది. అంటే 17 ఏళ్లలో దాదాపు 600 శాతం పెరిగిందన్నమాట.తొలి సీజన్‌లో ఎంతంటే? 2008లో ఐపీఎల్ ఫ్రాంచైజీల వద్ద ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు రూ.22.5 కోట్లు ఉండేవి. ఆ తర్వాత 2011నాటికి అది రూ.43.2కోట్లకు పెరిగింది. అంటే ఏకంగా డబుల్ అయ్యింది. అలాగే 2014నాటికి ఆ లిమిట్ కాస్త రూ.60 కోట్లయ్యింది. 2018కి రూ.80 కోట్లు, 2022కి రూ.90 కోట్లకు పెరిగింది. అయితే వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ సీజన్‌కు ఏకంగా రూ.120 కోట్లకు పెరిగిపోయింది. అంటే ప్రారంభ సీజన్ నుంచి ఇప్పటివరకు దాదాపు 600 రెట్లు పెరిగిందన్నమాట.ఐపీఎల్ పాలక మండలి నిర్ణయాలు మరి కొన్నాళ్లలో మెగా వేలం జరగనున్న నేపథ్యంలో ఫ్రాంఛైజీలు తమ టీమ్‌లోని ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఐపీఎల్ పాలకవర్గం ఇటీవలే అనుమతినిచ్చింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కలిసి ఉంటుందని పేర్కొంది. జట్టు దగ్గర ఉండే మొత్తం రూ.120 కోట్లు అయితే, అట్టిపెట్టుకున్న అయిదుగురి కోసం రూ.75 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని తెలిపింది. అయితే 2022లో జరిగే మెగా వేలంలో ఆయా జట్లకు నలుగురిని మాత్రమే అట్టిపెట్టుకోవడానికి అవకాశమిచ్చారు. ఈ సారి ఆ సంఖ్య ఆరుకు పెరిగింది.అయిదుగురిని అట్టిపెట్టికుంటే మిగిలేది రూ.45 కోట్లే!ఐపీఎల్ పాలక వర్గం నియమాల ప్రకారం, ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్న మొదటి ప్లేయర్‌కు వారు రూ.18 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. రెండో ప్లేయర్‌కు రూ.14 కోట్లు, అలాగే మూడో ఆటగాడికి రూ.11 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇక నాలుగు, అయిదో ఆటగాణ్ని కూడా అట్టిపెట్టుకుంటే వారు తిరిగి వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాల్సి వస్తుంది. ఏ ఫ్రాంఛైజీ అయినా సరే అయిదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకుంటే వారికి రూ.45 కోట్లు మాత్రమే మిగులుతాయి.

Jai DURGA BHAVANI
BUILDING PLANNERS
T.Satyanarayana
Cell: 93953 85229
86887 83383
HMDA, DTCP,
Layout Approvals,
Building Permissions,
Construction Drawing,
Estimations,
Valuations
RERA Approvals,
All GHMC Works,
We Undertake Building,
Constructions & Development,
Bank Loans
Building Elevation Designs
# K P Towers,Above Telangana State Co-Operative Apex bank,
Brahmanapally road,Ragannaguda,Turkayamjal, Rangareddy-Dist-501510.

తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| శుక్రవారం 04 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

## ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు చెప్పిందన్న మంద కృష్ణ



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. అందరికంటే ముందే సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన ముఖ్యమంత్రి... అమలు చేయడం లో మాత్రం ఎందుకు శ్రద్ధ చూపించడం లేదో అర్థం కావడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆగస్ట్ 1న ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పునకు విరుద్ధంగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారన్నారు. ముఖ్యమంత్రి ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారని, 9వ తేదీన నియామక పత్రాలు ఇస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత డీఎస్సీ పరీక్షలు జరిగాయని, వాటి విషయంలో వేగం ప్రదర్శించిన రేవంత్ రెడ్డి వర్గీకరణ విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన మాటకు విరుద్ధంగా ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కమిటీ వేసి అనంతరం అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఈ విషయంపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని నిలదీశారు. అధిష్ఠానం ఒత్తిడి ఒకవైపు , ఇంకోవైపు రాష్ట్రంలో మాలల ఒత్తిడి వల్ల వర్గీకరణ అమలుకు వెనుకాడుతున్నారని ఆరోపించారు. జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 9న అన్ని జిల్లాల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతామన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సన్మానించిన చైర్మన్



**మన్రిగూడ, అక్టోబర్ 04(శాసన సభ ):** మాల్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా నియమించిన దొంతం అలివేలు సంజీవరెడ్డి మార్కెట్ యార్డులో డైరెక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్,మేకల జగన్ రెడ్డికి,జమ్ముల వెంకటేష్ గౌడ్, గంట మల్లేష్ కు ఘనంగా సన్మానం చేశారు. పాలకవర్గం సహాయంతో మార్కెట్ యార్డ్ ను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు.

## మూడు ఫామ్ హౌస్‌లు ఎక్కడ ఉన్నాయో చూపించాలన్న మాజీ మంత్రి



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా తనను ఎంతగా టార్గెట్ చేసినా ప్రజల తరపున ప్రశ్నించడం మాత్రం ఆపేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సబితా ఇంద్రారెడ్డి తనయుల ఫామ్ హౌస్‌లు కూల్చాలా? వద్దా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారని, కానీ అవి ఎక్కడ ఉన్నాయో చూపించాలన్నారు. మా అబ్బాయి కడుతున్న ఇల్లును మినహాయించి, మీరు చెప్పినట్లుగా మరో మూడు ఫామ్ హౌస్‌లు మాకు ఎక్కడ ఉన్నాయో బయటపెట్టాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి మాట తీరును తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. ఆత్మాభిమానం కంటే మించిన ఆస్తి లేదని గుర్తించాలన్నారు. సీఎం ముందు లేదా ఇంకెవరి వ్యక్తుల ముందైనా పేద ఏడుపులు ఏడ్చే పరిస్థితిని తనకు దేవుడు కల్పించలేదన్నారు.

## తుర్కయంజాల్‌లో అధికారుల నిర్వాకం

### - అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

### - కాంట్రాక్టర్లకు అధికారులు తొత్తులుగా మారినట్లు ఆరోపణలు

**తుర్కయంజాల్,అక్టోబర్ 04(శాసన సభ ) :**

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజాప్రతినిధుల అవినీతి బాగోతాలు తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు శాపంగా మారుతోంది. ప్రజలకు నాలుగు కాలాల పాటు ఉపయోగపడాల్సిన, గుర్తుండిపోవాల్సిన పనుల్లో నాణ్యతకు కాంట్రాక్టర్లు తిలోదకాలిస్తున్నా అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



**'ప్రతిష్టాత్మక పనిలో నాణ్యత కరువు'**

రాగన్నగూడ, యంజాల్ పరిధిలోని పలు కాలనీలను అనుసంధానిస్తూ రూ. 7కోట్ల పైచిలుకు వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రంక్‌లైన్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రాగన్నగూడ జెడ్పీ హైస్కూల్ దగ్గర నుంచి గణేష్ టెంపుల్ వరకు సాగర్‌రహదారికి ఆనుకొని యూజీడీ పనులు సాగుతున్నాయి. ఈ పనులు మొదలైనప్పటి నుంచి మ్యాన్‌హోల్స్ పనుల్లో మొత్తం డస్టే వాడుతూ, నాణ్యతకు తూట్లు పొడుస్తున్నా అటు అధికారులు, ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు కన్నెత్తిచూడకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.



**'ఇంజినీరింగ్ విభాగంపై తీవ్ర ఆరోపణలు'**

తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. అభివృద్ధి పనుల విషయంలో సిబ్బంది పర్యవేక్షణ ఉండటంలేదని తెలుస్తోంది. పనులు జరుగుతున్న చోట ఉండి, చేయించాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టర్లపై స్థానికులు మండిపడుతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా ఏఈ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి.

**'బానోత్ భిక్షపతి, డీఈ, తుర్కయంజాల్'**

అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. ఈ విషయంలో కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం పనులు నాసిరకంగా చేస్తే బిల్లులు నిలిపివేస్తాం. అలాంటి కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో చేర్చుతాం.

## సేఫ్టీ మోకులు ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలి:

# చండూరు ఎక్సైజ్ ఎస్.ఐ.స్వాతి



**చండూరు అక్టోబర్ 3 ( శాసనసభ న్యూస్ ) :** సేఫ్టీ మోకులు ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలని చండూరు ఎక్సైజ్ ఎస్సై స్వాతి, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అన్నారు. చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేఫ్టీ మోకులు వినియోగించడం వలన ప్రతి గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కేటప్పుడు ప్రమాదం నుండి రక్షణ పొందవచ్చునివారు తెలిపారు. గీత కార్మిక వృత్తిచాలా ప్రమాదకరమైనది. గీత కార్మికుడికి కాటమయ్య రక్షణకవచం చాలా అవసరమని ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలనివారు తెలిపారు. సేఫ్టీ మోకులు లేకపోవడం వలన చాలామంది గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికుల కోసం సేఫ్టీ మోకులపై తీసుకున్న నిర్ణయాన్ని గీత కార్మికులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ అధికారులు సైదులు, శ్రీను కుమార్, నల్లగొండ టీం ట్రైనర్స్ కాసాని సత్తయ్య, సైదులు, శంకరయ్య, గీత పని వారలసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శంకరయ్య, ఎక్సైజ్ అధికారి ప్రభాకర్ గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు తొమ్మిది రకాల వంట

## సరుకులను అందివ్వాలి : కాసాల



**చండూరు అక్టోబర్ 3 ( శాసనసభ న్యూస్) :** రేషన్ కార్డు కలిగి ఉన్న పేద ప్రజలకు ప్రతి నెల రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటుగా చక్కెర, చింతపండు, గోధుమలు, కందిపప్పు, ఉప్పు, కారం, పసుపు, వంట నూనె ఇలా తొమ్మిది రకాల వంట సరుకులను అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచిపోయిందని, నేటికీ ఒక బియ్యంతోనే సరి పెట్టడం సరికాదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రకాల వంట సరుకులను అందివ్వాలని నల్గొండ జిల్లా మాజీ ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కోటయ్య గూడెం గ్రామంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి కార్డు పై ప్రతి నెల కేంద్ర ప్రభుత్వం మూడు కేజీల చొప్పున అందించే సబ్సిడీ గోధుమలను రాష్ట్రమంతటా సప్లై చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కేవలం హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో మాత్రమే చాలాకాలంగా గోధుమలు సప్లై చేస్తోందని పేర్కొన్నారు. పట్నం, పల్లె అనే వివక్ష లేకుండా కార్డు కలిగిన పేదవారికి తొమ్మిది రకాల వంట సరుకులను ప్రభుత్వం అందివ్వాలన్నారు.

# రుణమాఫీపై వివరాలు వెల్లడించిన

## మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**శాసనసభ న్యూస్ ప్రతినిధి :** రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు ఎప్పటికప్పుడు చెప్పినప్పటికి బీజేపీ పెద్దలు, రాష్ట్ర నాయకులు రైతులను గందరగోళ పరిచి వాళ్ల రాజకీయ పబ్బం గడుపుకునేందుకు దీక్షల పేరిట కొత్త డ్రామాకు తెరతీశారు. వారికి అర్థమయ్యే విధంగా మరొక్కసారి వివరాలన్ని తెలియజేస్తున్నామన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాష్ట్రంలో మొత్తం రైతుల సంఖ్య 65.56 లక్షలు అని, వీరిలో తెలంగాణ రాష్ట్రంలో భూములు ఉండి, తెలంగాణలో ఉన్న బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య 42 లక్షలు అని ఆయన తెలిపారు. 2018 రుణమాఫీ పథకంలో గత ప్రభుత్వానికి అందిన ఖాతాలు 40 లక్షలు మాత్రమే అని ఆయన వ్యాఖ్యానించారు. 2018 రుణమాఫీ పథకం కనీసం 20 లక్షల మందికి కూడా రుణమాఫీ కాలేదు. అదికూడా ఆఖరి సంవత్సరం చేసిన విషయాన్ని మీకు గుర్తుండే ఉంటుందన్నారు. అంతేకాకుండా..'అలాకాక మా ప్రభుత్వం గుర్తించిన 42 లక్షల మందికి మొదటి పంటకాలంలోనే రుణమాఫీ 2024 అమలు చేయడానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. వీరందరికి 2 లక్షల వరకు రుణమాఫీ చేయడానికి కావాల్సిన మొత్తం అంచనా 31 వేల కోట్లు. వీరిలో 2 లక్షలలోపు రుణాలు తీసుకొని కుటుంబ నిర్ధారణ చేసిన ఖాతాల సంఖ్య 22,37,848. రుణమాఫీ చేసిన మొత్తం 17933.19 వేల



కోట్లు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే 2 లక్షలలోపు రుణాలను రుణమాఫీ చేశాము. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మిగతా 20 లక్షల మందికి 2 లక్షల వరకు రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదే. ఆర్థిక వెసులుబాటు చూసుకుంటు ఇది పూర్తి చేస్తాము. పైన సంబంధించిన లెక్కలలో మీకేమైన అనుమానాలు ఉన్నట్లయితే బ్యాంకువారిగా మీరు కూడా పర్యటించి వివరాలు తీసుకోవచ్చు. ఇంత పారదర్శకంగా లెక్కలు ఉన్నప్పటికి, రుణమాఫీ 2024 పథకం పూర్తి అయినట్లు, మేము ప్రకటించినట్లు మళ్ళీమళ్ళీ అవే అబద్దాలు చెప్పి మీ స్థాయిని దిగజార్చుకోవద్దు. తుమ్మలకి మంత్రిపదవులు కొత్తకాదు. మంత్రిపదవి కోసమో, ఇతర పదవులకు ఆశపడో మాట్లాడే నైజం తుమ్మలది కాదు. గత నెలలో కురిసిన భారీ వర్షాలవలన రైతువారి జరిగిన నష్టం మీకు తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నివారణ కింద 10 వేల కోట్ల సహాయం అర్థిస్తే కేవలం 400 కోట్లు మాత్రమే విధిల్చిన కేంద్ర ప్రభుత్వం, అక్కడ అధికారంలో ఉన్న బిజెపి పెద్దలను మీరేమన్నా ప్రశ్నించారా? మీరు తెలంగాణలో మీ పరపతిని పెంచుకోవాలనుకుంటే, తెలంగాణకి వచ్చే నిధుల కోసమో, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసమో రాష్ట్ర ప్రభుతంతరపున మీరు కూడా కేంద్ర ప్రభుత్వంపై పోరాడండి. కేంద్ర ప్రభుత్వం వరికి ప్రకటించిన మద్ధతు ధర కంటే కూడా రూ.500 బోనస్ అధికంగా సన్న రకాలకు ప్రకటించి ఈ పంటకాలం నుంచే కొనుగోలుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే దొడ్డు రకం రేషన్ బియ్యం ఎలా దుర్వినియోగం అవుతుందో మీకు తెలియంది కాదు. ఈ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, మా ప్రభుత్వం మీద 2000 కోట్లు అదనపు భారం పడిన కూడా సన్న బియ్యం సేకరించి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు దారులకు , అన్ని వసతి గృహాల విద్యార్థులకు సరఫరా చేయడానికి ప్రణాళిక చేశాము. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య పథకం ఆరంభించినపుడు 37 లక్షలుగా ఉన్నది. అది గత వాయిదాలో 30 లక్షలకు కుదించడం జరిగింది. ఈ లెక్క గురించి కూడా సమాధానం చెప్తే తెలంగాణ రైతాంగం హర్షిస్తుంది. ఇప్పటికైనా బిజెపి రాష్ట్ర నాయకులు నా గురించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాల్సిందిగా సూచిస్తున్నాను.' అని మంత్రి తుమ్మల అన్నారు.

## డీజేల వినియోగంపై

# నిషేధం

### - చింతపల్లి ఎస్సై బి. యాదయ్య



**చింతపల్లి, అక్టోబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** నల్గొండ జిల్లాలో ఈ నెల 14 వరకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బహిరంగ ప్రదేశాల్లో ఉపయోగించే డిజేలతో సహా అధిక వాల్యూమ్ సౌండ్ ఎమిటింగ్ సిస్టమ్స్ ల వినియోగంపై నిషేధం విధిస్తూన్నట్లు జిల్లా ఎస్పి ప్రకటనలో తెలిపారని చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో డీజేలు నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబెల్స్ కారణంగా మానవ ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై ప్రభావాలు పడుతున్న కారణంగా నిషేధించడం జరిగిందన్నారు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లోనూ అధిక శబ్ధం కలిగించే డిజేలను వినియోగించరాదన్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను చట్టాన్ని ఉల్లంఘించి, ఎవరైనా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

శాసనసభ
శుక్రవారం 04 అక్టోబర్ - 2024

# కుటుంబ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం



**చండూరు అక్టోబర్ 3 (శాసనసభ న్యూస్ ) :** చండూరు మున్సిపాలిటీ లోని 3వ వార్డు ( లక్కినేనిగూడెం ) లో నియోజకవర్గ పైలెట్ ప్రాజెక్టు కింద కుటుంబ డిజిటల్ కార్డు సర్వే గురువారం మునుగోడు డివిజన్ అధికారి ఆర్డిఓ సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని అధికారులకు సూచించారు అదేవిధంగా మునిసిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ అక్టోబర్ 7వ తారీకు చివరి తారీకు ఉన్నందున వార్డులో ఉన్న మీ మీ కుటుంబ సభ్యులంతా ఆధార్ కార్డుతో అందరూ వచ్చి కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో ఫోటో దిగాలని వార్డు ప్రజలకు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మునీర్ ఆలీ ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటరెడ్డి గట్టుపల్ ఎమ్మార్వో రాములు మునుగోడు ఎమ్మార్వో శ్రీనివాసులు మున్సిపాలిటీ కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నల్లగొండ జిల్లాలో డి.జెల వినియోగం పై నిషేధం జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**నల్గొండ,శాసన సభ ప్రతి నిధి :** నల్గొండ జిల్లా పరిధిలో ఈ నెల 14 వరకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బహిరంగ ప్రదేశాల్లో ఉపయోగించే డి. జె లతో సహా అధిక వాల్యూమ్ సౌండ్ ఎమిటింగ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు జిల్లా ఎస్పి గారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో డీజేలు నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబెల్స్ కారణంగా మానవ ఆరోగ్యం మరియు మానసిక ఆరోగ్యంపై ప్రభావాలు పడుతున్న కారణంగా నిషేధించడం జరిగింది ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదిక శబ్దం కలిగించే డిజే లను వినియోగించ రాదని అన్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను చట్టాన్ని ఉల్లంఘించి, ఎవరైనా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు.

# ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ పథకం పై అవగాహన సదస్సు





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, అక్టోబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రోగ్రామ్ అధికారి, అదనపు ప్రోగ్రామ్ అదికారి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఈసీ టెక్నికల్ అసిస్టెంట్ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 2025-26 సంవత్సరమునకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పదకం ప్రణాళికా రూపకల్పన పై ఒక రోజు అవగాహన సదస్సు గురువారం నిర్వహించడం జరిగినది.ఇందులో జిల్లా కలెక్టర్ శశాంక పాల్గొని 2025-26 సంవత్సరమునకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రణాళికా రూపకల్పన పై తగు సూచనలు చేసినారు. గ్రామ పంచాయతీ వారిగా, మండల వారీగా, జిల్లా వారీగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ పరిచి ప్రణాళికా రూపొందహించాలని సూచించారు. గత సంవత్సరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సాధించిన ప్రగతికి డిఆర్డిఓ గారిని, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రోగ్రామ్ అధికారి, అందరు ఊపాధి హామీ సిబ్బంధిని ప్రశంసించారు. సంబందిత రికార్డులను నిర్వహించాలని సూచించారు. జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రణాళికా రూపకల్పన పై గ్రామ సభ నిర్వహణ, పనుల ఎంపిక అంచనా పై అవగాహన కల్పించారు. ఈసదస్సులో శ్రీయుత అదనపు కలెక్టర్, ( స్థానిక సంస్థలు ), ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా ప్రజా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారి, ఏపీ డీఎస్ ఎస్,ఎస్ క్యూ సి ఓ పాల్గొన్నారు.

# చండూర్ మున్సిపాలిటీ భాగ్యనగర్ కాలనీ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**చండూర్ అక్టోబర్ 3 (శాసనసభ న్యూస్):** చండూరు మున్సిపాలిటీ భాగ్యనగర్ కాలనీలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. కాలనీ మహిళలు ముందుగా వెంపలి చెట్టుకు పూజలు నిర్వహించి అనంతరం తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఒక్క దగ్గర ఉంచి పాతకాలం పద్ధతిలో ఆటపాటలతో బతుకమ్మ రాయడం జరిగింది. అనంతరం బతకమని గంగలో కలపడం జరిగింది. ఏ ఉత్సవాల్లో భాగ్యనగర్ కాలనీ మహిళలతో పాటు కాలనీ పెద్దలు పాల్గొనడం జరిగింది.

# నాలుగు ప్రభుత్వ ఉద్యోగులు సాదించిన కొలను వేణు కుమార్



**చండూర్ అక్టోబర్ 3 (శాసనసభ న్యూస్) :** చండూర్ వాసి కొలను చంద్రమౌళి అబ్బాయి కొలను వేణు కుమార్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో కృషితో సాదించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్ గణితం శాస్త్రం విభాగంలో జిల్లా లో 83.33 మార్కులతో రెండవ ర్యాంక్ సాధించారు. గత మూడు నెలల క్రిందట వెలువడిన గురుకుల ఫలితాల్లో గణితం శాస్త్రం విభాగంలో టి. జి.టి.జోన్ 1 ర్యాంక్, పి. జి. టి.32 వ ర్యాంక్, జె.ఎల్. లో 75 ర్యాంక్ సాధించారు. మరియు గ్రూప్ 4 విభాగంలో 1:3 కు ఎంపికయ్యారు. ఇంకా తుది ఫలితాలు వెలువడాల్సి ఉంది. వేణు కుమార్ తండ్రి చేనేత కార్మికులు గా పనిచేస్తున్నారు. వేణు కుమార్ పలు పాఠశాలలో గణితం శాస్త్రం ఉపాధ్యాయుని పని చేశారు. తన విజయానికి కుటుంబ సభ్యులు తోటి స్నేహితులు ఎంతగానో తోడ్పడినవారికి ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# నేనావత్ నందులాల్ మృతి బాధాకరం : రవీంద్ర కుమార్



**దేవరకొండ అక్టోబర్ 03 శాసనసభ న్యూస్ ప్రతినిధి** చందంపేట మండలం తెల్దేవరపల్లి గ్రామానికి చెందిన నేనావత్ నందులాల్ మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.గురువారం తెల్దేవరపల్లి గ్రామంలో నందులాల్ మృతి దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నందులాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.నందులాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట మాజీ జడ్పీటీసీ బొయపల్లి శ్రీనివాస్ గౌడ్,రమావత్ మోహన్ కృష్ణ, జర్పుల లోక్య నాయక్,బొడ్డుపల్లి కృష్ణ, తరి గోవర్దన్,కుక్కముడి లక్ష్మయ్య,తదితరులు ఉన్నారు.

# వావిళ్ళ పల్లి గ్రామంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**చండూర్ అక్టోబర్ 3 (శాసనసభ న్యూస్):** నారాయణ పురం మండలం పరిధిలో వావిళ్ళ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీ లో ఎంగిలి పువ్వు బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఇంధిరా కాలనీ మహిళలు అందరూ కలిసి మెలిసి సాంస్కృతిక సాంప్రదాయం సామాజికంగా పసుపు నీలం రంగులో వస్త్రాలు ధరించి ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు చిన్నారులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోని వాటర్ మెన్ లకు మండల పరిషత్ లో శిక్షణ శిబిరం

- శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, మిషన్ భగీరథ అధికారులు
- శిక్షణ కార్యక్రమానికి హాజరైన 40 మంది మంచినీటి సహాయకులు






**చింతపల్లి, అక్టోబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి** గ్రామాలలో ప్రజల నీటి అవసరల కోసం ఒక వ్యవస్థ మిషన్ భగీరథ. చింతపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 9:30 గంటలకు బ్యాచ్ నెంబర్ 6 లోని 40 గ్రామపంచాయతీలకు సంబంధించిన మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. ఎంపీడీవోతో పాటు మిషన్ భగీరథ ఏఈ, డీఈఈ సమక్షంలో చింతపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. చింతపల్లి మండలం నుండి 20 మంది,మర్రిగూడ మండలం నుంచి 20 మంది మొత్తం 40 మందికి మంచినీటి సరఫరా పై గురువారం శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రతి గ్రామపంచాయతీ నుండి డిపిఓ కార్యాలయం నుండి ఎన్నిక చేయబడ్డ ఒక మల్టీ వర్కర్, వాటర్ మెన్ తీసుకొని గ్రామ మంచినీటి సరఫరాలో భాగాలైన చేతిపంపుల రిపేర్, సింగల్ ఫేస్, 3 ఫేస్ మోటార్లు, రిపేర్ పైప్ లైన్ లీకేజీ రిపేరు, ట్యాంక్ శుభ్రపరిచే విధానం, క్లోరినేషన్, చేసే విధానం పరీక్షలు చేయుట, రిజిస్టర్ లో వివరాలు నమోదు తదితర అంశాలపై శిక్ష తరగతులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో మిషన్ భగీరథ సబ్ డివిజన్ దేవరకొండ డివైఇఇ కె నరేష్, ఎంపీడీవో సుజాత, మర్రిగూడ మిషన్ భగీరథ ఏఈ జి.వెంకటేశ్వర్లు, చింతపల్లి మహిని మిషన్ భగీరథ ఏఈ బి.శేఖర్, చింతపల్లి మిషన్ భగీరథ ఏఈ (గ్రిడ్) కె. లింగం తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత ముద్దు బిడ్డకు రెండు కొలువులు



**చండూర్ అక్టోబర్ 3 (శాసనసభ న్యూస్):** కనగల్ మండలం పరిధిలో పొనుగోడు గ్రామ వాసి అయిన కట్ట.యాదయ్య లలిత దంపతుల కుమారుడు కట్ట.వెంకటేష్ ప్రభుత్వం ప్రకటించిన డి.ఎస్.సి. ఫలితాలలో తెలుగు అసిస్టెంట్ ఉద్యోగం లో 70.83 మార్కులు రాగ జిల్లా లో రెండవ ర్యాంకు, భాష పండితుడు ఫలితాలలో 72.33 మార్కులు జిల్లాలో మూడవ ర్యాంకు సాధించాడు. తాను కోరుకున్న ఉద్యోగం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. నాకు సహకరించిన ఊరి ప్రజలకు స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చండూర్: అన్నదాతల పరిస్థితి అయోమయం



**చండూర్ అక్టోబర్ 3 (శాసనసభ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారులు కళ్ళెం.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ తెల్ల బంగారంగా బావించే పత్తి రైతుల పరిస్థితి శాపంగా మారుతుంది. ఈ సంవత్సరం ఆకాల వర్షాలు కురవడం తో పండించిన పంటను అమ్ముకుందామంటే సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, పత్తి వ్యాపారులు అందరూ సిండికేట్ గా మారి సీజన్ ప్రారంభంలో 7200 పలికిన పత్తి ధర ఇప్పుడు 5500 పడిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన తెలంగాణ శాసనసభ తెలుగు దిన పత్రికలో ఈ ప్రాంతాల్లో వార్తలు సేకరించడానికి విలేకరులు కావలెను.
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు
నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న డేట్ లైన్లు
నల్గొండ జిల్లా: చందంపేట, డిండి, పి.ఏ.పల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, చండూర్, మునుగోడు, హాలియా, పెదవూర, నిడుమనూరు, నల్గొండ, కనగల్, మిర్యాలగూడ, త్రిపురారం, కట్టంగూర్, తిప్పర్తి, నకిరేకల్ తదితర ప్రాంతలలో పనిచేయుటకు ఆసక్తిగల వారు క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించండి.
తెలంగాణ శాసనసభ దినపత్రిక నెట్‌వర్క్ ఇంచార్జ్ వెంకటేశ్
సెల్: 9949360937,9100900931